# పత్రికా ప్రకటన

హైదరాబాద్,

తేదీ: 03-04-2007

## ఓబీసీ రిజర్వేషన్లను కొనసాగించాల్సిందే - లోక్‌సత్తాపార్టీ

మనదేశంలోని ప్రస్తుత సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఓబీసీ రిజర్వేషన్లను కొనసాగించాల్సిందేనని లోక్‌సత్తా పార్టీ స్పష్టం చేసింది. రిజర్వేషన్లను నిలుపుచేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తలెత్తిన సంక్షోభ పరిస్థితులను చక్కదిద్దటానికి ప్రభుత్వం తక్షణచర్యలు చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి చేసింది. ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోకుండా జాతి ప్రయోజనాల దృష్ట్యా విశాలదృక్పథంతో చూడాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి.వి.ఎస్ వర్మ పేర్కొన్నారు.

శతాబ్దాల తరబడి అణచివేతకు గురైన కులాలవారికి సామాజిక న్యాయం జరగాలంటే, వారికి సమాజంలో గౌరవప్రదమైన స్థానం లభించాలంటే రిజర్వేషన్లు తప్పనిసరి అని వర్మ అన్నారు. అయితే క్రీమీలేయర్‌కు రిజర్వేషన్లు మినహాయించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, రిజర్వేషన్లు మాత్రమే వెనకబడిన, బలహీనవర్గాల సమస్యను పరిష్కరించలేవని వర్మ స్పష్టంచేశారు. కులప్రాతిపదికన రిజర్వేషన్లను సిఫార్సు చేసిన కమిషన్లన్నీ ఈ విషయాన్ని విస్పష్టంగా పేర్కొన్నాయని ఆయన గుర్తుచేశారు. మూలస్థానంలో సమస్యను పరిష్కరించకుండా, రిజర్వేషన్లనే పరిష్కారం అనుకుంటే తాత్కాలిక ఉపశమనమే తప్ప అసలు సమస్య ఎన్నటికీ పరిష్కారం కాదు. కులం, ఆర్థిక స్తోమతుతో ప్రమేయంలేకుండా ప్రతి బిడ్డా పరిపూర్ణంగా వికసించే అవకాశాలనూ, పరిస్థితులనూ కల్పించాలని  వర్మ అన్నారు. అలాగే ఇతర కులాల్లోని ఆర్థికంగా వెనకబడినవారి సమస్యలపై కూడా స్పందించి తగు పరిష్కారాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యను పొందటానికి పేదరికం ఎటువంటి పరిస్థితుల్లోనూ అవరోధం కాకూడదని ఆయన అన్నారు.

కుల,మత,వర్గాలకు అతీతంగా ప్రతి పౌరుడికీ నాణ్యమైన విద్య, ఉచిత ఆరోగ్యం అందించేందుకు లోక్‌సత్తా పార్టీ కట్టుబడి ఉంటుందని వర్మ పేర్కొన్నారు.

:: లోక్‌సత్తా పార్టీ